# ఈ బ్రతుకు నీ కోసం

బీరరాజు



"మీరు వెళ్ళక తప్పదా?"

నా కాళ్ళవైపు కూర్చుని కాళ్ళను నెమ్మదిగా నొక్కుతూ అంది సుశీల.

సుశీల గొంతులో వినిపించిన దిగులు ఓ క్షణం నా మనస్సు చివుక్కుమంది.

కొన్ని క్షణాల మౌనం తర్వాత అన్నాను. "లేదు సుశీలా! నేను వెళ్ళాలి. ఇప్పుడు వెళ్ళకపోతే జీవితంలో మిగిలిపోయిన ఈ అసంతృప్తితోనే చచ్చిపోతాను. అయినా నెలరోజులు ఎంతలో గడుస్తాయి? లేనిపోని ఆలోచనలతో మనస్సు పాడుచేసుకోకు. నాకు తెలీకుండానే నా గొంతులో ఏదో జీర పలికింది.

పదిగంటల ఆ చీకటిరాత్రిలో సుశీల మనస్సులోనూ, నా మనస్సులోనూ చీకటి దట్టంగా అలుముకుంది.

కొన్ని నిమిషాల మౌనం తర్వాత సుశీల నా రెండుపాదాలమీద తల ఆన్చి నెమ్మదిగా ఏడుస్తూ అంది. 'ఇంతకా మిమ్మల్ని విడిచి వారంరోజుల కం ఎక్కువ ఎప్పుడూ గడపలేదు. నన్ను మీతోపాటు తీసుకెళ్ళండి. నా భయంగా వుంది."

సుశీల మాటలకు అప్పటివరకు బిట్టుకున్న ధైర్యం నాలో ఒక్కసా వదలిపోయింది. నా గొంతును ఎవ్వరొ నొక్కిపట్టినట్టు మాటలు పెదవులదా టైటికి రాలేదు.

కొన్నిక్షణాల్లో నన్ను నేను తమ యించుకుని బలవంతంగా గొంతు పెగ కుని, "సుశీలా! నువ్వనవసరంగా భర పడుతున్నావ్. నాతోపాటు నిన్నూ తీస కెళ్ళేవాడినే, కాని నేను వెళ్ళేప్రాంతాల్లో చలి ఎక్కువగా వుంటుంది. అసలే ఆరోగ్యం అంత మంచిది కాదు. యి వంటి సమయంలో నువ్వొచ్చినా ఇబ్బంది పడాల్సివస్తుంది. ఆ యి

రిటైరైపోయిన మనిషిని నాకు యింట్లో మాత్రం ఏం కోస్తుంది చెప్పు!" అను నయంగా అన్నాను సుశీలను దగ్గరకు తీసుకుని ఆమె చెక్కిళ్ళపై చారలుకట్టిన కన్నీళ్ళను తుడుస్తూ.

కొన్ని నిమిషాల మౌనం తర్వాత సుశీల అంది. "మీరు రేపు ఉదయం వెళ్తున్న సంగతి పెద్దాడికీ కోడలికీ చెప్పారా!" అని.

"మధ్యాహ్నం భోజనం చేస్తున్న ప్పుడే చెప్పాను" ముక్తసరిగా అన్నాను.

ఇంతలో పక్కగదిలోంచి చిన్నగా దగ్గు వినపడింది. ఆ వెంటనే గుసగుసలు. ఎంత వినకూడదని ప్రయత్నించినా నా చెవి పరిధిని దాటిపోలేదు.

"ముసలాయన పొద్దున్న బండిలోనే వెళ్ళిపోతాడట. ఎలాగూ వెళ్లేది తీర్థ యాత్రంకేగా పెళ్ళాన్ని కూడ తీసికెళితే చక్కగా ముసలివయసులో 'హనీమూన్' జరుపుకున్నట్టుంటుంది" అది కోడలి గొంతు.

"ఆయన లేదు లేదు అంటాడు గానీ ఎక్కడో డబ్బు దాచిపెట్టే వుంటాడు. పైసా విదల్చడు. పోయేటప్పుడు ఏం పట్టుకుపోతాడో" అది తన రక్తం పంచుకుపుట్టిన ప్రథమ పుత్రరత్నం గొంతు.

నా గుండెలో ఏదో కలుక్కుమంది. చటుక్కున మొహంతిప్పి సుశీలవైపు చూశాను. ఆ మాటలు విన్నదేమోనని.

ఆమె అదృష్టమో ఏమోగానీ ఆ మాటలు ఆమె చెవిని సోకలేదు. అప్పటికే ఆ మొహానికి పాట్లుపడుతోంది.

నాకు నిద్రపట్టలేదు.

నా మనస్సు అందోళనతో నిండి పోయింది.

నేను చేసుకున్న పాపమేమిటోగానీ నాకూహ తెలిసినప్పట్నుంచీ నా జీవితం సజావుగా సాగలేదు. ఎగ్జిక్యూటివ్ ఇంజ నీరుగా పనిచేసి యిటీవలే పదవీవిరమణ చేసిన నేను వృత్తిలో ముక్కుసూటిగా పోయి నాకంటూ ఏమీ నిల్వచేసుకోలేక పోయాను. అయినా నాకొచ్చే జీతం రాళ్ళ మీద నా యిద్దరికొడుకులకి పెద్దచదువులే చెప్పిద్దామని ప్రయత్నించాను గానీ చిన్న తనంలోనే చెడు అలవాట్లకు లోనైన నా కొడుకులిద్దరూ తక్కువ చదువుతోనే చదువాపేసి చిన్న ఉద్యోగాల్లో స్థిరపడి పోయారు. యిక మిగిలిన ఒక్క కూతుర్ని నా శాహతుకు మించి అప్పు చేసి మంచి సంబంధమే చేశాను. నా దుర దృష్టమేమో తెలీదుగానీ అల్లుడుకన్నా, కూతురే తను కోరుకున్న గొంతెమ్మ కోర్కెలు తీర్చలేకపోయామని పుట్టిం టితో సంబంధం తెంచేసుకుంది.

నేను ఏదో సంపాదించి ఎవ్వరికీ తెలీకుండా ఎక్కడో బ్యాంకులో దాచు కున్నానని, నా తదనంతరం అది నా కూతు రికి చెందేట్టు రాశాననీ నా కొడుకులిద్దరికీ నామీద అనుమానం. కానీ నిజం నేనెంత చెప్పినా వాళ్ళు నమ్మరు. నాకు వచ్చే పెన్షన్ కొంత అమ్మేసి నా కూతురు పెళ్ళికి చేసిన అప్పు తీర్చేశానని చెప్పినా వాళ్ళకు నమ్మకం కుదరదు.

నా బిడ్డలసంగతి బాగా తెల్సిన నేను రిటైరై పోయిన ఊళ్ళోనే ఏదో ఒక అద్దె కొంపలో నా కొచ్చే పెన్షన్ డబ్బుల్తో గడుపుదామంటే నా భార్య వినలేదు. "ముసలి వయసులో యిక్కడెందుకు? కలో గంజో పిల్లలతోనే కలిసి తాగుదా మని" పోరు పెట్టి లాక్కొచ్చింది.

నా పిల్లల స్వభావం సుశీలకు తెల్సినా మాతృప్రేమను తొందరగా చంపుకో లేదు. ఎంతయినా ఆమె ఈ గడ్డమీద పుట్టిన మామూలు స్త్రీ.

పెద్దకొడుకు కోడళ్ళ నిర్లక్ష్యం, నిరా దరణ నన్నీమధ్య బాగా కృంగదీశాయి.

ముప్పైఏళ్ళకు పైగా యింజనీరింగ్ సర్వీసులో క్షణం తీరికలేని జీవితం గడి పిన నాకు యింట్లో ఖాళీగా కూర్చోవా లంటే బోర్‌గా వుంది. నా కొచ్చే పెన్షన్ డబ్బుల్లో చాలమట్టుకు పెద్దాడికి నెలనెలా ముట్టజెప్పుతున్నా నేను నా భార్య వాళ్ళింట్లో వూరికినే కూర్చుని తింటున్నా మన్న భావన వాళ్ళలో బాగా నాటుకు పోయింది. సాధ్యమైనంతవరకు నా కోడలు సూటిపోటిమాటలు వినబడనట్టే నటించడం నేర్చుకున్నా నీ మధ్య. సుశీల మాత్రం ఒంట్లో ఓపికలేకపోయినా ఎప్పుడూ ఏదో ఒక పనిలో లీనమైనట్టే కనపడుతుంటుంది.

పక్కగదిలోంచి మనవడి ఏడుపు గట్టిగా వినపడడంతో నా ఆలోచనల్లోంచి తేరుకున్నాను.

మళ్ళీ పక్కగదిలోంచి మాటలు ఎంత వద్దనుకున్నా నా చెవినిపడ్డాయ్.

"వూరుకోరా, వూరుకో! అర్ధరాత్రి అపరాత్రి లేకుండా ఏమిటా ఏడుపు? అయినా యింట్లో ముసలాళ్ళు వున్నారన్న మాటేగానీ పిల్లల్ని కూడ పట్టించుకోరు. వెధవ నంత భరించలేకపోతున్నాను" కోడలి గొణుగుడు. కోడలిమీద నాకు విపరీతమైన కోపంవచ్చింది. ఎంత నంగ నాచిలా మాట్లాడుతోంది.

పిల్లాడ్ని తను ఎంతో దగ్గరకు తీయా లని ప్రయత్నించాడు. పిల్లాడు నాకెక్కడ చేరువై పోతాడోనన్న భయంతో - వాడ్ని నా ఛాయలకే రాకుండా జాగ్రత్తపడింది. ఇప్పుడు వాడు నన్ను చూస్తేనే జడుసు కుని పారిపోతుంటాడు.

అందుకే నాకు ఈ జీవితంమీద విసు గెత్తింది. కొన్నాళ్ళపాటు బద్రీనాద్-హృషికేష్ మొదలైన తీర్థయాత్రలు పూర్తిచేసుకురావాలని అకస్మాత్తుగా ప్రయాణం పెట్టుకున్నాను. నిజానికి నాకు చిన్నప్పట్నించీ సాహిత్యమంటే మక్కువ ఎక్కువ. కాలేజీ రోజుల్లోనూ ఉద్యోగంలో చేరిన కొత్తలోనూ అడపా దడపా కథలు రాసి పత్రికలకు పంపించే వాడ్ని. కొన్ని కథ లచ్చయ్యేవి. మరి కొన్ని తిరిగొచ్చేవి. తర్వాత ఉద్యోగంలో 'బిజీ' అయిపోయి పుస్తకాలు చదవడం రాయడం మానుకున్నాను - కానీ నాకు చిన్నతనంనుంచీ ఓ కోరిక మనసులో మిగిలిపోయింది. అదేవిటంటే దేశాటన చేసి, వివిధ రకాలైన జీవితాలను సుని శితంగా గమనించి 'జీవితం'మీద ఓ మంచి నవల రాయాలని. ఆ కోరిక యింతకాలా నికి ఈ రూపేణా నెరవేరబోతోంది.

బయట చర్చి గంటలు మూడు కొట్టాయి.

నాకు యింక నిద్రపట్టలేదు. నెమ్మ దిగా లేచి పెరటి తలుపులు తీశాను. చల్లటిగాలి రివ్వున మొహంమీది కొచ్చింది తలుపు చప్పుడుకు గబుక్కున లేచి కూర్చుంది సుశీల.

"టైమెంతయింది? అప్పుడే లేచి పోయారేం?" ఆవలిస్తూ అంది.

"యింకా ట్రైనుకు చాలా టైముంది గానీ నువ్వు పడుకో. వెళ్లేముందు లేపు తాలే!" అన్నాను.

"ఇంకేం పడుకుంటాన్లెండి. మీకు మొహం కడుక్కోడానికి వేన్నీళ్ళు పెడతా నుండండి" అంటూ లేచివెళ్ళి పెరటి వరండాలోనున్న స్టవ్ వెలిగించింది.

కాలకృత్యాలన్నీ ముగించుకునేటప్ప టికి గంటపైగా పట్టింది.

నా సూట్‌కేస్ తీసుకుని బయలు దేరాను.

గుమ్మంవరకు వచ్చిన సుశీల అంది. "పెద్దాడిని లేపమంటారా?"

"వద్దు మంచి నిద్రలో ఉన్నట్టున్నాడు పడుకోనియ్" అన్నాను.

"మీ ఆరోగ్యం జాగ్రత్త. వేళకి తినడం మర్చిపోకండి. రెండు రోజులకో ఉత్తరం రాయండి" గుమ్మందాటి నాతో పాటు నడుస్తూ అంది.

"అలాగే కానీ, నువ్వారోగ్యం జాగ్రత్తగా చూసుకో. ఒంట్లో ఏమాత్రం బాగోలేకపోయినా పెద్దాడితో మందులు తెప్పించుకో. అలక్ష్యం చేయకు. నేను త్వరగా వచ్చేస్తానులే. దిగులుపడకు...." ఆఖరిమాట అంటున్నప్పుడు నా గొంతు ఎందుకో వణికింది.

"అలాగే" కన్నీళ్ళతో అంది.

భారంగా అడుగులేసుకుంటూ రిక్షా



స్టాండువైపు కదిలాను.

* * *

రైలు వేగంగా దూసుకుపోతోంది.

చీకటి తెరలను చీల్చుకుని వెలుగు కిరణాలు దూసుకొస్తున్నాయి. తూరుపు ఎర్రబడుతోంది. తూరుపునుంచి వచ్చే చల్లటిగాలి కిటికీలోంచి రివ్వున దూసుకొచ్చి చెవుల్లో గిలిగింతలు పెట్టింది.

సూట్‌కేసులో వున్న మఫ్లర్ తీసుకుని చెవులమీంచి చుట్టుకున్నాను.

బెర్తులమీద జనం యింకా నిద్రపోతున్నారు.

నా మనస్సు ఎంత వద్దనుకున్నా వెనక్కి పోతోంది. నిజంగా నా మన

స్వంత సున్నితమని నాకు యింతవరకు తెలీదు.

"నేను యిల్లో అలిగి వెళ్ళిపోతు న్నానా?" అన్న నేను ప్రశ్నించుకున్నాను.

జవాబు ఏమైనప్పటికీ రెండు మూడేండ్ల తర్వాత వేసుకోవాల్సిన ప్రయాణం యిప్పుడు 'సడన్'గా వేసుకోవాల్సి వచ్చింది.

ఏదో స్టేషన్‌వస్తే రైలు కొద్ది నిముషాలు ఆగి మళ్ళీ బయలుదేరింది. అయితే రైలుకున్న ఈ కొద్ది నిమిషాల విరామం కూడ నా ఆలోచనలకు లేకుండా పోతోంది.

వ్యక్తులకు స్వంత ఆస్తిపాస్తులు లేకుండా వృద్ధులు, తల్లిదండ్రులు యువ తరంమీద ఆధారపడకుండా 'రష్యా' లోలా అన్నీ ప్రభుత్వమే చూసుకుంటే ఎంత బావుంటుంది? అనిపించింది. అయినా నా పిచ్చిగాని ఈ దేశంలో కర్మ సిద్ధాంతంమీద నమ్మకం, సెంటిమెంట్స్ పోనంతకాలం ఈ బంధాలమీద ఏమాత్రం నమ్మకం లేకపోయినా తల్లిదండ్రులమీద పిల్లలు పిల్లలమీద పెద్దలు ఆధారపడక తప్పదు. అయినా లోకంలో నా బిడ్డలు లాంటి బిడ్డలే వుంటారా? అందరూ?

"నా బిడ్డల్ని నేను సరిగ్గా క్రమశిక్షణలో పెంచలేదేమో?" ముప్పైఏళ్ళ తర్వాత నా కటువంటి ఆలోచన వచ్చి నందుకు నాకే సిగ్గనిపించింది. నిజమే నా వృత్తిధర్మాన్ని నిర్వర్తించడానికే నాకున్న టైమ్ సరిపోలేదు.

నాకు వెంటనే నాన్న గుర్తుకొచ్చాడు. నా కళ్ళంట నీళ్ళు తిరిగాయి.

నన్ను పెంచి పెద్దచేయడానికి నాన్న ఎంత కష్టపడ్డాడో తల్చుకుంటే యిప్పటికీ నా కళ్ళు నీళ్ళతో నిండిపోతాయి. ఒక రోజు జరిగిన సంఘటన తను ఈ జన్మలో మర్చిపోలేదు.

ఆ రోజు యింజనీరింగు కాలేజీలో తనకు సీటు వచ్చిన రోజు. తనకొచ్చిన మంచి మార్కులు చూసి తనకంటే నాన్నే ఎక్కువ సంతోషించారు. ఏదో ప్రైవేటు కంపెనీలో నెలకి నూటఇరవై రూపాయల జీతంతో సంసారాన్ని ఈదుతున్న నాన్న ఈ బరువు మోయలేరేమో నని అమ్మ నన్ను కాలేజీలో చేర్పించడానికి సుతారమూ యిష్టపడలేదు

"బాబూ! యింతకాలం మీ నాన్న ఒక్కరే ఎంత కష్టపడ్డారో మీకు తెలీంది కాదు. అక్క పెళ్ళికోసం చేసిన అప్పు యింకా తీర్చలేదు. ఏదైనా ఉద్యోగంలో చేరి మీ నాన్నకు సాయపడరా!" అంది అమ్మ.

తను ఏమీ చెప్పలేక మౌనంగావుంటే నాన్నకి ఎంత కోపం వచ్చిందని?

"నా బిడ్డ కష్టపడి చదివి మార్కులు

తెచ్చుకున్నందుకే కదే వాళ్ళు పీటిచ్చింది. ఇటువంటి అవకాశం జన్మలో మళ్ళీ వాడికొస్తుందా? ఎంత కష్టమైనా సరే నేను వాడిని చదివిస్తాను. ఈ విషయంలో నువ్వింకేమీ మాట్లాడకు" అని అమ్మని కసురుకుని, "ఇంట్లో ఈ గొడవలెప్పుడూ వుండేయేగాని నువ్వెళ్ళి కాలేజీలో చేరే ఏర్పాట్లు చేసుకో బాబూ!" అన్నాడు.

నాన్న ఆశయం ప్రకారం తను ఐదేళ్లు కష్టపడి చదివి డిగ్రీ సంపాదించుకున్నాడు. ఆ మరునటి సంవత్సరమే ఉద్యోగం వచ్చింది. నాన్న తీర్చలేక పోయిన అప్పు తనే తీర్చేశాడు. కానీ తన సంపాదన ఓ సంవత్సరమైనా అనుభవించకుండానే అమ్మ - నాన్న ఓ రోజు అక్కయ్యని చూడ్డానికి వెళ్ళొస్తూ బస్సు ప్రమాదంలో అకస్మాత్తుగా మరణించారు.

ఆ 'షాక్'ని తట్టుకోడానికి తనకు-చాల సంవత్సరాలు పట్టింది.

రైలు ఏదో స్టేషన్‌లో ఆగింది.

పూర్తిగా తెల్లవారడంతో ఒక్కొక్కరే లేచి కాలకృత్యాలు తీర్చుకోడం మొదలుపెట్టారు.

నేను ఆలోచనల్లోంచి పూర్తిగా తేరుకుని నా వెంట తెచ్చుకున్న పుస్తకం చదవడంలో లీనమయ్యాను.

* * *

నేను యింటినుంచి బయలుదేరివచ్చి నలభై రోజులకు పైగా అయింది. ఒక రోజు గంగానది ఒడ్డున కూర్చుని అస్తమిస్తున్న ప్రభాకరుని అరుణకిరణాలకు ఆలవోకగా పులకిస్తున్న గంగమ్మతల్లిని చూస్తూ పరవశిస్తున్నాను.

ఇంతలో నా పక్కనుంచి ఓ జంట గట్టిగా నవ్వుకుంటూ వెళ్ళి పక్కనే వున్న బెంచీమీద కూర్చోడంతో నా ఏకాంతానికి భంగంకలిగి వాళ్ళవైపు చూశాను.

యిద్దరూ - వృద్ధదంపతుల్లా వున్నారు. వేరుశెనగకాయలు సిమెంటు బెంచీమీద పగలగొట్టుకుని - తింటూ పడుచుజంట కంటె మిన్నగా కబుర్లాడుకుంటున్నారు.

నాకు వెంటనే సుశీల గుర్తొచ్చింది. నేను యింటినుంచి వచ్చి యిన్ని దినాలైనా తనకు రెండుమూడు ఉత్తరాలకంటె ఎక్కువ రాయలేకపోయాను. నా యాత్రలో ప్రతి రాత్రి నేను చూసిన విశేషాలు విపులంగా రాసుకోడానికే నాకు టైం సరిపోలేదు.

పాపం సుశీల ఎలా వుందో? తను లోకం తెలీని అమాయకురాలు. యింట్లో పనిచేసేవాళ్ళను కూడా తను విసుక్కోడం ఎప్పుడూ చూడలేదు. తన జీవితమంతా నాకు సేవచేయడంతోనే సరిపోయింది. యిప్పుడు పిల్లలకి చేస్తోంది. సుశీలే గాని నా జీవిత భాగస్వామిగా రాకుంటే

బహుశా తను ఎప్పుడో నవ్వసించే వాడేమో?

పాపం యిప్పుడు తన ఆరోగ్యం ఎలా వుందో? ఆమెకు చలిగాలి అస్సలు పడదు. శీతాకాలంలో తనను చాల జాగ్రత్తగా చూడాలి. పెద్దాడు మందులు సరిగ్గా యిప్పిస్తున్నాడో లేదో?

సుశీలగురించి ఆలోచనలతో నా మనస్సు స్థిమితం కోల్పోయింది. "వెంటనే వెళ్ళి సుశీలను చూస్తేనేగాని నా మనసు కుదుట పడదు. ఈ రోజే బయలుదేరి వెళ్ళాలి" మనసులో అనుకుని లేచి బయలుదేరాను.

* * *

రిక్షా దిగి, గేటు తీయబోయిన నా చేతులు యింటి వరండాలో చూసిన దృశ్యానికి గేటుమీదే బిగుసుకుపోయాయి.

పరుగులాంటి నడకతో అక్కడికి చేరుకున్నాను.

వసారా అరుగుపై చాపమీద సుశీల శవం.

ఒళ్ళంతా తెల్లటిగుడ్డ కప్పబడివుంది. వెనుక చిన్న దీపం, అగరొత్తులు దీనంగా వెలుగుతున్నాయి. చిన్నపిల్లలు దూరంగా నున్న వేపచెట్టుక్రింద ఆడుకుంటున్నారు చిత్రమేమిటంటే పెద్దవాళ్ళు ఎవ్వరూ శవందగ్గర లేరు.

నా హృదయం బ్రద్దలయిపోతోం దీ హఠాత్పరిణామానికి ఒక్కసారి నన్ను నీరసం ఆవరించింది. నెమ్మదిగా వెళ్ళి సుశీల తలవైపు నేలమీద చతికిలబడ్డాను. సుశీల మొహంలోకి చూశాను. ప్రశాంతంగా నిద్రపోతున్నట్టుగా వుంది.

"సుశీలా! ఎంత అన్యాయంచేసి వెళ్ళిపోయా ఈ వయసులో? నేను వేసుకున్న ప్రయాణమే సుశీల మరణానికి దారి తీసిందా!" మనసు ఆక్రోశించింది. గది లోంచి వరండాలోకొచ్చిన కోడలు ఒక్కసారి ఆశ్చర్యపోయినట్టు నన్ను చూసి "మీ రెప్పుడొచ్చారు మామయ్యా?" అని "ఏమండీ మీ నాన్నగారొచ్చారు" అంటూ లోపలికి ఓ కేకేసి, "చూశారా మావయ్యా అత్తయ్య ఎంత అన్యాయంచేసి వెళ్ళిపోయారో" అంటూ చిన్నగా ఏడుపు లంకించుకుంది ఒక్క నిమిషం గడవకుండానే పరుగులాంటి నడకతో యింట్లోంచి నా యిద్దరు కొడుకులు, కూతురూ వచ్చి నన్ను చూసి బావురుమన్నారు. కొద్దిసేపయిన తర్వాత నా పెద్ద కొడుకు అన్నాడు. రెండు రోజులక్రితం అమ్మకి గుండెనొప్పి వచ్చింది. డాక్టర్ని తీసుకొచ్చి మందులిప్పించాను. మీకు టెలిగ్రాం యిద్దామంటే మీ రెక్కడుంటారో సరిగ్గా తెలీదు - రాత్రే అమ్మ పోయింది."

నా కొడుకు మాటల్లో సంజాయిషీ కనపడింది.

నేను తలెత్తి ఎవ్వరి మొహంలోకి చూడలేదు- అప్పలు చూడాలనిపించలేదు. నేను ఏం మాట్లాడకపోయేటప్పటికి ఒక్కొక్కరే మెల్లగా అక్కడ్నుంచి జారుకున్నారు.

మళ్ళీ వరండామీద సుశీల - నేను ఒంటరిగా.

నిర్జీవంగా సుశీల - జీవం వుండి లేనట్టు నేను.

సుశీల చనిపోయేముందు నాకేమైనా చెప్పాలనుకుందా? లేక ఎవ్వరికైనా ఏమైనా చెప్పిందా? ఎవరినైనా పిలిచి అడగాలనుకున్నాను. కానీ నా గొంతు మూగబోయినట్టయి ఆ ప్రయత్నం విర మించుకున్నాను నెమ్మదిగా లేచి. నేను సుశీల ఎప్పుడూ వుండే గదిలోకి వెళ్ళి తలుపులు జారవేసి సుశీల ట్రంకుపెట్టె తెరిచాను. బట్టలపైనే ఓ కాగితంముక్క నా కంటబడింది.

తీసి గబగబ చదివాను.

అయన వెళ్ళి చాలరోజులైంది. ఈ మధ్యన వుత్తరాలు రావటంలేదు. ఎలా ఉన్నారో. నాకీ మధ్యన విపరీతంగా ఆయాసం వస్తోంది. పెద్దాడికి ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవటంలేదు. నాకెందుకో చాల బెంగగా వుంటోంది. బహుశా ఆయన రాకుండానే పోతానేమో? నేను గానీ పోతే నా మెడలోవున్న నాల్గుపేటల గొలుసు సగం నా కూతురికి, సగం నా పెద్దకోడలికి యివ్వండి

ఎవ్వర్నీ సంబోధించకుండా డైరీ రాసుకున్నట్టు సుశీల ఓ కాగితం ముక్క మీద పెన్సిలుతో రాసుకుంది.

ఒక్కసారిగా నాలో నీరసం ఆవ హించి వళ్ళంతా చెమటలు పట్టేశాయి. తూలుతున్న శరీరాన్ని అక్కడే వున్న కుర్చీలో చేరవేశాను.

కొన్ని నిమిషాలు గడిచాయి. లేవ డానికి ప్రయత్నించాను. కానీ నా శరీరం నా అధీనంలో లేనట్టనిపించింది.

అప్పుడే అకస్మాత్తుగా నా కళ్ళు గోడ మూలనున్న చేతి క ర్ర మీద కు మళ్ళాయి.

ఆ చేతికర్రను చూడగానే నా కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. చాలకాలం క్రిందట జరి గిన సంఘటన గుర్తుకొచ్చింది.

* * *

ఓసారి నేను, సుశీల మహాబలిపురం వెళ్లాం. అప్పటికి పిల్లలు యింకా కాలే జీల్లో చదువుతున్నారు. ఓ షాపుదగ్గర నగిషీతో చెక్కబడిన అందమైన చేతి కర్రను చూసి ముచ్చటపడి బేరమాడ కుండానే కొనేసింది సుశీల.

"ఆరె, అదేమిటి? చేతికర్ర కొన్నా వెందుకు?" ఆశ్చర్యంగా అడిగాను.

"మీ కోసమే" అంది ముసిముసిగా

నవ్వుతూ సుశీల.

"నాకప్పుడే చేతికి కర్ర యిచ్చేద్దామనుకుంటున్నావా?" వేళాకోళంగా నవ్వుతూ అన్నాను.

"మీరింకా వయస్సులోనే వున్నారనుకుంటున్నారేమిటి? మీకింకా సర్వీసు ఏడేళ్లే వుంది. తెల్సుగా!" నవ్వుతూ అంది సుశీల.

"నా సర్వీసు నాకంటె నీకే బాగా గుర్తుందోయ్. అయినా సుశీ, నిజం చెప్పాలంటే నేనెంత దృఢంగా వున్నానో చూడు. ఏడేళ్ళ తర్వాతనయినా నా శరీరంలో యింతకన్నా పెద్ద మార్పుండకపోవచ్చు" అన్నాన్నేను.

"అబ్బ వూరికే కంగారుపడకండి. మీరు బాగా ముసలివారై పోయిన తర్వాత చేతికర్ర సహాయంతో నడుస్తూంటే ఎలా వుంటారో చూడాలని నా కోరిక. అందుకే యిది కొన్నాను" పగలబడి నవ్వుతూ అంది.

"ఆ అవసరం నాకు రాదు" సీరియస్‌గా అన్నాను.

"ఎందుకని?" ఆశ్చర్యంగా అడిగింది సుశీల.

"ఆ మాత్రం తెలీదా? పిచ్చిదానా, నాలో సగభాగం నువ్వు. నేను నడవలేని స్థితిలో నీ భుజంమీద చేయివేసి నడుస్తాను గానీ ఇటువంటి కర్ర సహాయంతో కాదు" అన్నాను తేలిగ్గా నవ్వేస్తూ.

"నేనుగానీ మీకంటే ముందు పోతే?" సుశీల.

"సుశీ, నీ కీరోజు పిచ్చిగానీ పట్టిందా? ఏమిటీ వితండవాదం? అయినా నేను నీకంటే దాదాపు పదేళ్ళు పెద్ద - అది మర్చిపోయావా? పద టైమైపోతోంది బస్సుకి" చిరుకోపంగా అన్నాను.

* * *

ఇప్పుడు ఒక్కసారిగా పదేళ్ళవయసు మీదపడినట్లనిపించింది. కుర్చీలోంచి నీర్సంగా లేచి మూలనున్న చేతికర్ర నందుకుని తలుపులు తీశాను.

"నాన్నా! మీ రిక్కడున్నారా? మీ కోసమే వెదుకుతున్నాం పదండి" అంటూ నా పెద్దకొడుకు వరండాలోకి దారితీశాడు.

పదిహేను నిముషాలు గడవకముందే పాడె పైకిలేచింది. యింట్లో శ్లోకాలు తీవ్రస్థాయి నందుకున్నాయి.

పాడె ముందు పెద్దకొడుకు నడుస్తున్నాడు.

ఓ కొమ్ము నే నందుకున్నాను.

నేను కొమ్ము కాయడం చూసి—"అబ్బే మీ రెందుకు? నేను పడతానుండండి" అంటూ ఓ దూరపు బంధువు నా దగ్గర్నుంచి లాక్కోబోయాడు. కానీ నా తీవ్రమైన చూపులకు తట్టుకోలేక ఆ ప్రయత్నం విరమించుకున్నాడు.

"యిన్నేళ్ళుగా నా సేవకు అంకితమై పోయిన సుశీలకు ఈ మాత్రం కూడ చేయలేకపోతే యిప్పటివరకు బ్రతికిన నా బ్రతుకుకు అర్థం గోచరించదు" అనిపించింది.

పాడె స్మశానం చేరుకుంది.

బ్రతికుండగా తల్లి హృదయానికి మంటబెట్టినా, యిప్పుడామె చితి ముట్టించినందుకు నా పెద్దకొడుకును చూసి సుశీల ఆత్మ ఏమనుకుందో ఏమోగానీ, చితి ముట్టించి– కన్నతల్లి రుణం తీర్చుకున్నానన్న తృప్తితో కాబోను నా పెద్దకొడుకు దీర్ఘంగా నిట్టూరుస్తూ వచ్చి నా పక్కన నిలబడ్డాడు.

క్షణాల్లో చితిమంటలు పైకి లేచాయి.

ఒక్కొక్కరే నెమ్మదిగా యింటి మొహం పట్టారు.

నా రెండో కొడుకు ఎప్పుడు జారుకున్నాడో తెలీదు..

చితి పూర్తిగా కాలి బూడిదయ్యేటప్పటికి నేను – నా పెద్దకొడుకు మాత్రం అక్కడ మిగిలాం.

అక్కడేవున్న తుమ్మచెట్టుకింద కూర్చున్న నా దగ్గరకొచ్చి, "నాన్నా యింటికివెళదాం పదండి" అన్నాడు.

నేను లేచి నిలబడ్డాను.

నా చొక్కా జేబులో చేయిపెట్టి సుశీల రాసిన వుత్తరం, ఆమె గొలుసు, ఏడు వందల రూపాయలున్న నా బ్యాంకు సేవింగుబుక్కు తీసి వాడిచేతిలో పెట్టాను.

"యిప్పుడివన్నీ నా కెందుకు నాన్నా! మీరు యింటికి పదండి ముందు" అన్నాడు.

"నువ్వెళ్ళు నేను కొంచెం సేపాగి వస్తాను" ఎక్కడో నూతిలోంచి వచ్చినట్టనిపించింది నా మాట.

"నాన్నా! మీరు...." ఏదో చెప్పాలనుకుని నా మొహంలోకి చూసి ఆ ప్రయత్నం విరమించుకుని గబగబ నడిచి వెళ్ళిపోయాడు.

అప్పటివరకు నిగ్రహించుకున్న దుఃఖం కట్టలు తెంచుకుంది.

"సుశీలా! నిన్ను నేనే చంపుకున్నాను. నీ కోరిక ప్రకారం నీదగ్గరే వుంటే నువ్వు తప్పక బ్రతికుండేదానివి. కట్టుకున్న భర్త దగ్గరలేక, కన్నపిల్లల ఆదరణకు నోచుకోలేక ఆఖరిక్షణాల్లో నువ్వెంత నరక మనుభవించవుంటావో నే నూహించుకోగలను" చితిమీద పడి వెక్కివెక్కి ఏడుస్తున్న నాకు అకస్మాత్తుగా జ్ఞానోదయం కలిగినట్టయింది. నాలో వున్న నీత్వం ఏమైపోయిందో తెలీదుగానీ ఆవేశంతో ఒక్కసారి పైకిలేచి చితిమంట గుప్పెడు బూడిద తీసి నా జేబులో వేసుకున్నాను. దూరంగా వున్న సముద్ర ఘోష నా చెవుల్ని బ్రద్దలుకొడుతోంది. సరుగుడు చెట్ల పక్కనుంచి సముద్రంలోకి దారితీస్తున్న కాలిబాటమీద నేను పిచ్చిగా పరుగెడుతున్నాను.

—oxo—